క్లుప్తంగా

వైఎస్ జగన్‌తో నియోజకవర్గ నేతల భేటీ



మాజీ సీఎం వైఎస్ జగన్‌తో అదీప్‌రాజ్, శరగడం, గండి రవి

పెందుర్తి: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్, పార్టీ సీనియర్ నాయకులు శరగడం చినఅప్పలనాయుడు, గండి రవికుమార్ గురువారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. నగరంలోని ఎయిర్‌పోర్టులో కలిసి పుష్పగుచ్ఛం అందించి, నియోజకవర్గంలోని పలు అంశాలను వివరించారు.

ఘనంగా పునర్వసు నక్షత్ర హోమం



హోమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని సింహగిరిపై గంగధార వద్దనున్న ప్రాచీన రామాలయంలో గురువారం హోమాన్ని వైభవంగా నిర్వహించారు. సీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామి ఉత్సవ మూర్తులను వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, మండపారాధన, అగ్నిప్రతిష్ఠ, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీరామ పారాయణ చేశారు. భక్తులకు ప్రసాదాన్ని అందించారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ ఆధ్వర్యంలో అర్చకులు ఈ కార్యక్రమాలను నిర్వహించారు.

అనాథాశ్రమ భూమిపూజకు ఆహ్వానం



ఎమ్మెల్యే రమేష్‌బాబును సత్కరిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

పెందుర్తి: స్వామి వివేకానంద మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గొల్లలపాలెంలో నిర్మించనున్న అనాథాశ్రమానికి నవంబర్ 17న జరిగే భూమిపూజకు హాజరు కావాల్సిందిగా ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబును ట్రస్ట్ ప్రతినిధులు ఆహ్వానించారు. గురువారం ఎమ్మెల్యేను కలిసి, అభినందన సత్కారం చేసి, ఆహ్వాన పత్రిక అందించారు. ఆహ్వానించిన వారిలో ఎస్.కె.ఎల్.రావు, రాపాక యాదవ్, వాసుపల్లి ఎల్లాజీరావు ఉన్నారు.

గొల్లగరువు రోడ్డుకు మరమ్మతులు చేయరూ..



అధ్వానంగా మారిన గొల్లగరువు రోడ్డు

పరవాడ: మండలంలో అధ్వానంగా మారిన రావాడ శివారు గొల్లగరువు రహదారితో అవస్థలు పడుతున్నామని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుపై నీరు నిలిచి అధ్వానంగా మారింది. సుమారు కిలోమీటరు నిడివి కలిగిన రోడ్డు పొడవునా భారీ గుంతలు ఏర్పడి, నిత్యం అవస్థలు ఎదుర్కొంటున్నారు. రహదారికి మరమ్మతులు చేపట్టాలని అధికారులకు విన్నవించినా ఫలితం కనిపించలేదని గొల్లగుంటకు చెందిన అలీ ఆవేదన వ్యక్తం చేశారు. మళ్లీ వర్షాలు పడితే రోడ్డు మరింత అధ్వానంగా మారుతుందని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

పెందుర్తి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటరావు తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ మధుపాడ నాగమణి అధ్యక్షతన ప్రారంభం కానున్న సమావేశంలో మండలంలోని సమస్యలు, ఇతరాత్ర అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. సభ్యులంతా హాజరు కావాల్సిందిగా కోరారు.

నిర్వహణ చతికిల 'బడి'

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పాఠశాల విద్య ఓ వెలుగు వెలిగింది. కార్పొరేట్ స్కూళ్లను మించి సౌకర్యాలను అందిపుచ్చుకుంది. వాటిని కొనసాగించడంలో కూటమి ప్రభుత్వం ఆరంభం నుంచీ వెనకడుగు వేస్తోంది. ప్రస్తుతం పాఠశాల నిర్వహణ నిధులూ లేక హెచ్‌ఎంలు సొంత డబ్బులు వెచ్చిస్తున్నారు. సబ్బవరం మండలంలో హెచ్‌ఎంలు ప్రతి నెలా తలో రూ.5 వేలు నుంచి రూ.10 వేలు వరకు తమ జేబు నుంచే చెల్లిస్తున్నారు.



నాడు–నేడులో ఏర్పాటు చేసిన వాష్ బేసిన్ల ప్రస్తుత దుస్థితి

- స్కూల్ కాంపోజిట్ గ్రాంట్స్‌కు నిరీక్షణ
- స్కావెంజర్లు, వాచ్‌మన్ల జీతాలకూ ఎదురుచూపులు
- హెచ్‌ఎంలపైనే పాఠశాల నిర్వహణ బాధ్యతల భారం
- ప్రతి నెలా రూ.5 వేలు నుంచి రూ.10 వేలు చేతి చమురు

సబ్బవరం:

కూటమి ప్రభుత్వంలో సర్కారీ స్కూళ్ల నిర్వహణ కునారిల్లుతోంది. సుద్దముక్కలూ, డస్టర్లు, స్టేషనరీ సామగ్రికి ఏ రోజుకారోజు ప్రధానోపాధ్యాయులు వెతుకులాడాల్సిన దుస్థితి. ఇప్పటికే హెచ్‌ఎంలు సగటున రూ.50 వేలు వరకు తమ సొంత నిధులు వెచ్చించి పాఠశాల అవసరాలు తీర్చుతున్నారు. మరోవైపు స్కావెంజర్లు, వాచ్‌మన్‌ల జీతాలూ పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో స్కూల్ ఆవరణ, మరుగుదొడ్ల పరిశుభ్రత గాలికొదిలేశారు. వీరికి నెలల తరబడి జీతాలు పెండింగ్‌లో ఉండటంతో హెచ్‌ఎంలు కూడా గట్టిగా గదమాయించి పనిచేయించే పరిస్థితి లేకుండా పోయింది.



సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల

స్కూల్ కాంపోజిట్ గ్రాంట్సే ఆధారం

మండలంలో ప్రభుత్వ పరిధిలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 51 ఉన్నాయి. వీటిలో 3,493 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. పాఠశాల కేటగిరీ, విద్యార్థుల సంఖ్య ఆధారంగా స్కూల్ కాంపోజిట్ గ్రాంట్స్ విడుదల చేయాలి. పాఠశాల నిర్వహణలో భాగమైన సుద్ద ముక్కలు, బ్లాక్‌బోర్డులు, డస్టర్లు, ల్యాబ్ సామగ్రి, టీఎల్‌ఎం సామగ్రి కొనుగోళ్లు, తలుపులు, కిటికీల మరమ్మతులు, స్వాతంత్ర్య, గణతంత్ర వేడుకలు తదితర విద్యా కార్యక్రమాలు, పాఠశాల కార్యాలయ నిర్వహణలో భాగంగా ప్రింటర్లు, తెల్లకాగితాలు, స్టేషనరీ తదితర అవసరాలకు ఈ గ్రాంట్ నుంచే వినియోగించాలి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ గ్రాంట్స్ నిలిచిపోయాయి. తాజాగా 50 శాతం గ్రాంట్స్ విడుదల చేస్తున్నట్లు విద్యాశాఖ మంత్రి ప్రకటించినా.. అవి ఎప్పటికి వస్తాయో తెలియని పరిస్థితి. స్కూల్ ఖాతాల్లో జమయ్యే వరకూ చెప్పలేమని ఉపాధ్యాయులు చెప్తున్నారు.

మండలంలోని పాఠశాలు, విద్యార్థులు		
స్కూల్ కేటగిరీ	స్కూళ్ల సంఖ్య	విద్యార్థుల సంఖ్య
ప్రాథమిక	40	771
ప్రాథమికోన్నత	3	185
ఉన్నత	8	2,537
మొత్తం	51	3,493

స్కూల్ గ్రాంట్స్ కేటాయింపులిలా..	
విద్యార్థుల సంఖ్య	నిధుల కేటాయింపు
1-30	రూ.10 వేలు
31-100	రూ.25 వేలు
101-250	రూ.50 వేలు
251-1000	రూ.75 వేలు
1001 దాటితే..	రూ.1 లక్ష

స్కావెంజర్లు, వాచ్‌మన్ల జీతాలకూ కటకట

పాఠశాల ఆవరణను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడంతోపాటు, మరుగుదొడ్ల నిర్వహణకు స్కావెంజర్లు, గత ప్రభుత్వంలో స్కూల్లో ఏర్పాటు చేసిన విలువైన పరికరాల సంరక్షణకు వాచ్‌మన్లను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నియమించిన విషయం తెలిసిందే.

వీరిని కాంట్రాక్ట్ ప్రాతిపదికన విధుల్లోకి తీసుకుని, ప్రతి నెలా రూ.6 వేలు చొప్పున నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లోనే జీతాలు జమచేసేవారు. ఇప్పుడు పరిస్థితి మారింది. ఆరు మాసాలుగా వీరికి పూర్తిస్థాయి జీతాల్లేవు. ఇటీవల నాలుగు మాసాల జీతాల్లో 50 శాతం పేరిట రూ.12 వేలు జమచేశారు. అది కూడా కొందరి ఖాతాల్లోనే. సగం జీతంతో బండెడు చాకిరీ చేసేదెలా? అంటూ స్కావెంజర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్ల పరిస్థితి

ఆరు మాసాలుగా వేతనాల్లేవు



సబ్బవరం గవర్నమెంట్ హైస్కూల్లో చాన్నాళ్ల నుంచి ఆయాగా చేస్తున్నాను. నాతో పాటు మరో మహిళ సన్యాసమ్మ కూడా ఆయాగా పని చేస్తోంది. మాకు నెలకు రూ.6 వేలు జీతం. ఆరు మాసాలుగా అది కూడా లేదు. ఇటీవల 4 నెలలకు సగం జీతం అని చెప్పి రూ.12 వేలు చెల్లించారు. నెలకు రూ.3 వేలు లెక్కన ఇచ్చారు. అరకొర జీతంతో బండెడు చాకిరీ చేస్తున్నాం. ప్రతి నెలా సమయానికి జీతమిస్తే బాగుండేది. మాతో పాటు వాచ్‌మన్‌గా పనిచేస్తున్న కడుపుట్ల రమణకూ అదే పరిస్థితి.

– కడుపుట్ల దేవుడమ్మ, స్కావెంజర్/ఆయా

సొంత డబ్బులు వెచ్చిస్తున్నాం



పాఠశాల నిర్వహణ నిధులు ఈ ఏడాది ఇంకా రాలేదు. తరగతుల నిర్వహణకు అవసరమయ్యే బోధనా సామగ్రి, చాక్‌పీస్‌లు, డస్టర్లు, ల్యాబ్ మెటీరియల్ తదితర అవసరాలకు మా జేబులో నుంచి డబ్బులు తీయాల్సి వస్తోంది. కార్యాలయ నిర్వహణకు అవసరమయ్యే ప్రింటర్, వైట్ పేపర్ల వంటి స్టేషనరీ సామగ్రిని కూడా మా సొంత నిధులతోనే కొనుగోలు చేస్తున్నాం. నెల జీతంలో కొంత భాగం ఇందుకే వెచ్చించాల్సి వస్తోంది. ప్రభుత్వం ఎప్పుడు నిధులు విడుదల చేస్తుందా? అని ఆశగా ఎదురుచూస్తున్నాం.

– ఎస్.తిరుపతిరావు, హెచ్‌ఎం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సబ్బవరం

నిధులు వచ్చాక చెల్లిస్తాం



గతంలో ప్రభుత్వ పాఠశాలల నిర్వహణకు ప్రభుత్వం నిధులు విడుదల చేసేది. స్కూళ్ల వారీగా విద్యార్థుల సంఖ్య ప్రాతిపదికన ఈ నిధులను చెల్లించేది. ప్రస్తుతం నిధులు రాకపోవడంతో నిర్వహణ భారంగా మారుతోంది. విద్యుత్ బిల్లులపై ప్రస్తుతం మినహాయింపునిచ్చారు. మిగిలిన నిర్వహణ వ్యయాన్ని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులే ప్రస్తుతం భరిస్తున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు వచ్చిన వెంటనే హెచ్‌ఎంల ఖాతాలకు జమవుతాయి. వీటి కోసం అంతా ఎదురుచూస్తున్నారు.

– లక్ష్మణరావు, మండల విద్యాశాఖాధికారి, సబ్బవరం

నిరంతర ధ్యానంతో మానసిక ఆరోగ్యం

- శాఖాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం
- స్పిర్చ్యువల్ టాబ్లెట్ సంస్థ ఫౌండర్ డాక్టర్ జీకే



పెందుర్తి: మానవ జీవనంలో ధ్యానం ఓ భాగం కావాలని ప్రముఖ ధ్యాన గురువు, స్పిర్చ్యువల్ టాబ్లెట్ సంస్థ ఫౌండర్ డాక్టర్ గోపాలకృష్ణ(జీకే) అన్నారు. శాఖాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమన్నారు. పాపయ్యరాజుపాలెంలోని పిరమిడ్ ధ్యాన కేంద్రంలో గురువారం ధ్యానంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా జీకే మాట్లాడుతూ మానసిక ఆరోగ్యానికి నిరంతర ధ్యాన ప్రక్రియ అవసరం అన్నారు. ధ్యానం ఒత్తిడిని జయించేలా చేస్తుందన్నారు. ప్రస్తుత సమాజంలో సామాజికంగా, ఆధ్యాత్మికంగా ఎలా జీవించాలో వివరించారు. మారుతున్న ఆహారపు అలవాట్లు, నిరంతర జీవన ప్రక్రియలో ధ్యానం ఎంతో అవసరం అన్నారు. ధ్యాన కేంద్ర నిర్వాహకులు, పలువురు ధ్యాన మాస్టర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి జాతీయ పశుగణన

సబ్బవరం: మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 25 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు అఖిల భారత పశు గణన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సబ్బవరం ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ కె.ఉషాకుమారి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా ఈ నెల 25న అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఈ పశు గణన కోసం 11 మంది సిబ్బందిని విషయ సేకరణదారులుగా నియమించగా వారికి ఆరిపాక పశు వైద్యాధికారి డాక్టర్ ఎస్.స్వర్ణలత, అంతకాపల్లి పశు వైద్యురాలు డాక్టర్ జి.అరుణ, గుల్లేపల్లి పశు వైద్యురాలు డాక్టర్ బి.సంధ్య సూపర్‌వైజర్లుగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. పశు గణన అనేది పశుసంవర్ధక శాఖలో వివిధ రకాల పథకాల రూపకల్పనకు, టీకాల తయారీకి, మందుల పంపిణీకి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పశుగణనకు ఇంటింటికీ వచ్చే సిబ్బందికి పశువులు, మేకలు, గొర్రెలు, కోళ్లు, కుక్కలు, జీవాల సమాచారం అందించాలని కోరారు.

పెందుర్తి: పశు గణన కార్యక్రమాన్ని శుక్రవారం నుంచి పెందుర్తి మండలంలో ప్రారంభించనున్నట్లు మండల పశు వైద్యాధికారి డాక్టర్ జగన్‌మోహన్‌రావు తెలిపారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు గ్రామాల్లో పశువైద్యశాఖ సిబ్బంది పశు జాతుల సంఖ్యను నమోదు చేస్తారన్నారు. భవిష్యత్‌లో ప్రభుత్వ పథకాలకు ఈ పశు గణన ప్రామాణికం కాబట్టి ప్రతీ పాడి రైతు గమనించాలని కోరారు.

గెడ్డవాగులో వేసిన పైపుల తొలగింపు

పరవాడ: మండలంలోనికలపాక రెవెన్యూ పరిధి మరిశవానిపాలెం సమీపంలోని గెడ్డ వాగులో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి అక్రమంగా వేసిన పైపులను గురువారం తొలగించినట్లు కలపాక వీఆర్వో నారాయణమ్మ తెలిపారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా రియల్ ఎస్టేట్ భూములకు గెడ్డ వాగు నుంచి పైపులు ఏర్పాటు చేశారన్నారు. సమాచారం అందడంతో సదరు స్థలాన్ని పరిశీలించి పైపులను తొలగించినట్లు వెల్లడించారు. ప్రభుత్వ భూములు, గెడ్డ వాగుల ఆక్రమణలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



గెడ్డవాగులో అక్రమంగా వేసిన పైపులను తొలగిస్తున్న దృశ్యం

పంచగ్రామాల భూసమస్య పరిష్కరించండి

- కలెక్టర్‌ను కోరిన సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంతో ముడిపడి ఉన్న పంచగ్రామాల భూసమస్యకి పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్‌ని సమైక్య ప్రజారైతు సంక్షేమ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో గురువారం ఆయన్ని కలిసి వినతిపత్రం అందించారు. పంచగ్రామాల్లో తమకున్న హక్కులను వివరించారు. దాదాపు 30 ఏళ్లుగా పంచగ్రామాల భూ సమస్యతో రైతులు, నివాసితులు, స్థలాలు కొనుగోలు చేసి ఇళ్ల నిర్మాణాలు చేసుకొని వారంతా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 1903లో సర్వే సెటిల్‌మెంట్ రికార్డులో ఉన్న రైతుల వద్ద నుంచి స్థలాలు కొనుగోలు చేసి, ఇళ్లు కట్టుకున్నట్లు తెలిపారు. 2014లో హైకోర్టు ఆదేశాలతో అప్పటి ప్రభుత్వం జేసీతో కూడిన ముగ్గురు అధికారులతో వేసిన కమిటీ కూడా తమకు అనుకూలంగానే మాట్లాడిందన్నారు. స్పందించిన కలెక్టర్ ఇళ్ల వరకు పరిష్కారం వచ్చేందుకు అస్కారం ఉందన్నారు. కలెక్టర్‌ని కలిసినవారిలో కార్పొరేటర్ బి.గంగారావు, సంఘం కార్యదర్శి టి.వి.కృష్ణంరాజు, ప్రతినిధులు బి.రమణి, వీబీఎస్ ప్రతాప్, జీవీ కృష్ణారావు, రాము విజయ్‌కుమార్ ఉన్నారు.



కలెక్టర్‌కి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ గంగారావు, సమైక్య ప్రజారైతు సంక్షేమ సంఘం నాయకులు

అప్రెంటిస్‌షిప్ మేళా నేడు

అగనంపూడి: హైదరాబాద్‌లోని టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ కంపెనీలో అప్రెంటిస్ ఖాళీల భర్తీకి శుక్రవారం ఉదయం 9 గంటలకు లంకెలపాలెంలోని హైటెక్ ఐటీఐలో అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహించనున్నట్లు హైటెక్ ఐటీఐ ప్రిన్సిపాల్ దుర్గనాయుడు తెలిపారు. ఈ మేళాలో వంద ఫిట్టర్, 40 పెయింటర్, 30 మిషనిస్ట్ ఖాళీలు భర్తీ చేస్తామన్నారు. అప్రెంటిస్ సమయంలో నెలకు రూ.11 వేలు, శిక్షణ పూర్తయ్యాక కొనసాగేవారికి నెలకు రూ.17 వేలు వేతనంగా చెల్లిస్తారని తెలిపారు. శిక్షణలో భోజనం, రవాణా చార్జీలు చెల్లిస్తారన్నారు. 18–24 మధ్య వయసు గల స్త్రీ, పురుషులు అర్హులన్నారు. ఏడాది శిక్షణ అనంతరం నేషనల్ అప్రెంటిస్ ట్రేడ్ సర్టిఫికెట్‌ను ప్రభుత్వం ద్వారా మంజూరు చేస్తారని తెలియజేశారు. ఆసక్తి గల అభ్యర్థులు బయోడేటా, పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు, టెన్త్ సర్టిఫికెట్, ఆధార్, ఐటీఐ ఉత్తీర్ణత పత్రాలతో హాజరు కావాలన్నారు.

చెత్తాచెదారంతో అధ్వానంగా కాలువ



తానాం ప్రధాన మురుగు కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారం

పరవాడ: తానాం గ్రామం ప్రధాన మురుగు కాలువ చెత్తాచెదారంతో నిండిపోవడంతో స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. గ్రామ సచివాలయం సమీపంలో ఉన్న ఈ కాలువలో చెత్త చెదారంతోపాటు, దట్టంగా గడ్డి, పిచ్చిమొక్కలు పెరిగి మురుగు నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారింది. దీంతో మురుగునీరు నిలిచిపోయి, దుర్వాసన వెదజల్లుతోంది. దోమల బెడద పెరిగి పరిసర నివాసులు తరచూ అనారోగ్యాల బారిన పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి కాలువలో పూడిక తొలగింపు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పరవాడ: వాడచీపురుపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో జంగిల్ క్లియరెన్స్ నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫలితంగా తిక్కవానిపాలెం, ఊటగెడ్డపాలెం, దలాయిపాలెం శివారు గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు.

సబ్బవరం మేజర్ పంచాయతీలో..

సబ్బవరం: మండలంలోని సబ్బవరం సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.రామకృష్ణ తెలిపారు. సబ్బవరం సెక్షన్–1 33/11 కేవీ, సబ్బవరం టౌన్–1, టౌన్–2 ఫీడర్ల నిర్వహణ పనుల్లో భాగంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకూ విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. దీంతో సబ్బవరం పంచాయతీ పరిధి సబ్బవరం, గొర్లివానిపాలెం, గొల్లలపాలెం, చిన్నయ్యపాలెం, ఆదిరెడ్డిపాలెం, పెదనాయుడుపాలెం గ్రామలకు విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు.

మర్యాదపూర్వక కలయిక



విజయసాయిరెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న గండి రవికుమార్ తదితరులు

సబ్బవరం: వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర జిల్లా రీజనల్ కోఆర్డినేటర్‌గా నియమితులైన రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డిని పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు గండి రవికుమార్ గురువారం మర్యాదపూర్వకంగా కలిసి, శుభాకాంక్షలు తెలిపారు. సీతమ్మధారలోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో వెళ్లి, ఆయన్ని కలిసి శాలువా వేసి, పుష్పగుచ్ఛం అందించారు. రవికుమార్ వెంట పార్టీ నాయకులు జేసీబీ ప్రసాద్, సబ్బవరం మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు, మొగలిపురం ఉపసర్పంచ్ సిరపరపు వాసు, అప్పికొండ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

పాల సేకరణ ధర పెంచాలంటూ రైతుల నిరసన

పరవాడ: విశాఖ మిల్క్ డెయిరీ యాజమాన్యం పాల సేకరణ ధరను రూ.5 తగ్గించి రైతులకు నష్టం కలిగించడం అన్యాయమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిసెట్టి సత్యనారాయణ మండిపడ్డారు. పాల సేకరణ ధర తగ్గింపును వ్యతిరేకిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో రైతులు గురువారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న గనిసెట్టి మాట్లాడుతూ పాల ధరను అర్ధంతరంగా తగ్గించడాన్ని రైతులంతా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. పాడి రైతులకు ఇవ్వాల్సిన బోనస్ ఇవ్వకుండా డెయిరీ యాజమాన్యం మోసం చేసిందన్నారు. పశువుల దాణా ఖర్చులు పెంచి రైతులపై భారం మోపిందని ధ్వజమెత్తారు. తగ్గించిన పాల ధరను వెంటనే పెంచని పక్షంలో ఈ నెల 29న డెయిరీని ముట్టడిస్తామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో కె.రామసూరప్పారావు, కృష్ణ, పాడిరైతులు పి.శంకర్రావు, బి.అప్పలనాయుడు, రెడ్డి నాయుడు, సతీష్, పి.పైడినాయుడు, బండారు చిన్నోడు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పాల సేకరణ ధర తగ్గింపుపై నిరసన తెలుపుతున్న విశాఖ డెయిరీ రైతులు

'రెవెన్యూ రికార్డుల పొరపాట్లు సరిచేసుకోండి'

సబ్బవరం: వ్యవసాయ, నివాస తదితర భూముల వివరాల నమోదులో పొరపాట్లను సరిచేసేందుకే రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ బి.చిన్నికృష్ణ తెలిపారు. మండలంలోని గాలిభీమవరంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని, రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో 134 సర్వే నెంబర్లతో 939.63 ఎకరాల భూములు ఉన్నాయన్నారు. వీటిలో 417.81 ఎకరాలు ప్రభుత్వ భూములు, 521.85 ఎకరాలు జిరాయితీ భూములున్నటన్లు పేర్కొన్నారు. రైతులు తమ రికార్డుల్లో ఏమైనా పొరపాట్లు, తప్పులు ఉంటే ఈ సదస్సులో నివేదించి, సరిదిద్దించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో గాలిభీమవరం సర్పంచ్ గొర్లి రాజేష్, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ వై.గణేష్, మండల సర్వేయర్ ఎల్.అప్పారావు, వీఆర్వో రామఅప్పారావు, సచివాలయ సర్వేయర్లు ఎం.ప్రసాద్, లోకేష్, గ్రామ పెద్దలు గొర్లి రమణ, వాకాడ గోవింద, కనకరాజు పాల్గొన్నారు.



గాలిభీమవరం రెవెన్యూ సదస్సులో అర్జీదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ చిన్నికృష్ణ

ఘనంగా అన్నసమారాధన



వడ్డిస్తున్న పోలమాంబ ఆటోస్టాండ్ అధ్యక్షుడు కర్రి అప్పారావు

సింహాచలం: 98వ వార్డు పరిధి సింహపురికాలనీలోని శ్రీ పోలమాంబ ఆటోస్టాండ్ ఆధ్వర్యంలో జరిగిన దేవి నవరాత్రుల ముగింపు, దుర్గాదేవి ఆలయ అభివృద్ధిని పురస్కరించుకుని గురువారం మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించారు. సింహపురికాలనీ, అప్పన్నపాలెం తదితర ప్రాంతాల నుంచి నివాసితులు, భక్తులు సుమారు రెండు వేల మంది తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. దుర్గాదేవిని దర్శించుకున్నారు. ఆటోస్టాండ్ యూనియన్ అధ్యక్షుడు కర్రి అప్పారావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.